క్లుప్తంగా

బీఆర్ఎస్‌లో చేరిక



జనగామ రూరల్ : మండలంలోని మరిగడి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మంగళవారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానించారు.

బొడ్డెమ్మ వేడుకలు




జనగామ : జనగామ పట్టణంలోని వాడవాడలా బొడ్డెమ్మ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంతో పాటు కుర్మవాడ, బాలాజీనగర్, ధర్మకంచ, అంబేడ్కర్ నగర్, శ్రీనగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో మహిళలు, చిన్నారులు, యువతులు బొడ్డెమ్మ ఆడారు.

కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



పాలకుర్తి టౌన్ : ఎరుకల ఆదివాసీ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా ఎరుకుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు దేవరాయ సాయిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఏకలవ్య విగ్రహం ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. బహుజన కులాల ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ గుమ్మడిరాజుల సాంబయ్య, మండల అధ్యక్షుడు దేవరాయ సురేష్, అంగిడి సోమనర్సయ్య, కృష్ణ పాల్గొన్నారు.

చిల్పూరు ఆలయ అభివృద్ధికి ఎంపీ కృషి



చిల్పూరు : తెలంగాణలో రెండో తిరుపతిగా పేరుగాంచిన మండల కేంద్రంలోని చిల్పూరు గుట్ట శ్రీబుగులు వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి మంగళవారం ఎంపీ కడియం కావ్య సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీ కావ్య సీఎంను కలిసి ఆలయ సమగ్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ పథకం ద్వారా సహకరించే విధంగా అవసరమైన నిధులు కేటాయించేలా చూడాలని కోరారు. ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు అయ్యేలా కృషిచేయాలంటూ సీఎం రేవంత్‌రెడ్డిని ఎంపీ కోరడంతో ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థుల క్షేత్రస్థాయి పర్యటన

జనగామ రూరల్ : మండలంలోని చౌడారం పీఎం శ్రీ మోడల్ స్కూల్ కళాశాలలో 12వ తరగతి ఒకేషనల్ ఐటీ విద్యార్థులు మంగళవారం క్షేత్రస్థాయి పర్యటన చేశారు. ఇందులో భాగంగా జనగామలోని పంజాబ్ నేషనల్ బ్యాంకును సందర్శించారు. కస్టమర్ రిలేషన్ షిప్, బ్యాంకు లావాదేవీలు ఏ విధంగా నిర్వహిస్తారో బ్యాంకు మేనేజర్ సంతోష్ కుమార్ విద్యార్థులకు తెలియజేశారు. ప్రిన్సిపాల్ సుధీర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి



హరీశ్ (ఫైల్)

దేవరుప్పుల : అప్పులు తీర్చలేక జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు ఆత్మహత్యయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మండలంలోని రంబోజీగూడెనికి చెందిన పుప్పాల హరీశ్ (23) మూడేళ్ల నుంచి హైదరాబాద్‌లో మోటార్ మెకానిక్‌గా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులు చేసిన అప్పులు తీర్చలేని పరిస్థితుల్లో జీవితంపై విరక్తిచెంది వారం రోజుల కింద హరీష్ కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో గడ్డిమందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. చికిత్స పొందుతూ నిమ్స్‌లో మృతిచెందగా స్వగ్రామానికి తీసుకు వచ్చి అంత్యక్రియలు చేశారు.

వ్యక్తికి ఒకరోజు జైలు

తరిగొప్పుల : మద్యంతాగి వాహనం నడిపిన ఓ వ్యక్తికి ఒకరోజు జైలు శిక్ష, రూ.2,000 జరిమానా విధిస్తూ జనగామ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వెంకట రామనర్సయ్య మంగళవారం తీర్పు చెప్పారు. జూన్ 25వ తేదీన ఎస్సై గుగులోత్ శ్రీదేవి మండలకేంద్రంలో డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్ నిర్వహిస్తుండగా మండలంలోని భోజ్యాతండా శివారు రూప్లాతండాకు చెందిన భూక్య వీరన్న మద్యంతాగి వాహనం నడుపుతు పట్టుబడ్డాడు. శిక్షపడిన వీరన్నను జనగామ సబ్ జైలుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

గుంతలమయంగా రహదారి

- వాహనదారుల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

జనగామ : జనగామ నుంచి దుద్దెడ వరకు నాలుగు లేన్ల రోడ్డు విస్తరణతో అన్ని వర్గాల ప్రజలకు రవాణా సౌలభ్యంతో పాటు సమయం ఆదా అవుతుంది. రోడ్డు విస్తరణ సమయంలో శామీర్‌పేట, చంపక్‌హిల్స్ రూట్‌తో పాటు బచ్చన్నపేట మండల కేంద్రంలో బైపాస్ మధ్యలో రోడ్డు నిర్మాణ పనులు నిపాందిగా సాగుతున్నాయి. దీంతో గుంతలమయంగా మారిన రోడ్డుపై కంకర తేలి దుమ్ము లేస్తుండడంతో ద్విచక్రవాహనదారులతో పాటు ప్రజలు నరకం చూస్తున్నారు. చంపక్‌హిల్స్, బచ్చన్నపేట టౌన్, శివారు ప్రాంతం సిద్దిపేట రోడ్డు చెరువు, మల్లెతోట కాల్వ సమీపంలో నూతన రోడ్డు నిర్మాణానికి నోచుకోక పోవడంతో సాఫీగా సాగే ప్రయాణంలో ఒక్క సారిగా బ్రేకులు పడుతున్నాయి. భారీ వాహనాలు వచ్చిపోయే సమయంలో విపరీతంగా పైకి లేస్తున్న దుమ్ముతో వందలాది మంది ఆరోగ్యాలపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. బచ్చన్నపేట మండల కేంద్రంలో ఈ పరిస్థితి దారుణంగా మారిపోయింది. రోడ్లను శుభ్రం చేయడంలో పంచాయతీ అధికారులు చేతులెత్తేయడంతో ప్రధాన చౌరస్తా అధ్వానంగా మారిపోయింది. నెలల తరబడి రోడ్లను శుభ్రం చేయక పోవడంతో రెండించుల మేర మట్టి పేరుకుపోయింది. బచ్చన్నపేటలో అసలు జీపీ అధికారులు పని చేస్తున్నారా లేదా అనే అనుమానాలను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. వెంటనే జిల్లా పంచాయతీ అధికారి స్పందించి ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రోడ్లను శుభ్రం చేయించాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.



దుమ్ముతో ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు



గుంతలమయంగా మారి మట్టితేలిన కంకర రోడ్డు

అహింసా మార్గం స్ఫూర్తిదాయకం

- ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పాలకుర్తి టౌన్ : గాంధీజీ చూపిన అహింసా మార్గం నూతన తరానికి స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గాంధీజీ లక్ష విగ్రహాల ప్రదర్శన పోస్టర్‌ను టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమండ్ల ఝాన్సీరెడ్డితో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడుతూ..అక్టోబర్ 11నుంచి 13వ తేదీ వరకు హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరిగే మహాత్మాగాంధీ జాతీయ సుస్థిర విజ్ఞాన సదస్సును విజయవతం చేయాలని పిలుపునిచ్చారు. ఏఐసీసీ కోఆర్డినేటర్ డాక్టర్ పులి అనిల్, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కంటికి రెప్పలా కాపాడుకుంటా..

కొడకండ్ల : కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులను కంటికి రెప్పలా కాపాడుకుంటామని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. మొండ్రాయి గ్రామానికి చెందిన కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మచ్చ రాంకుమార్ ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబ సభ్యులను మంగళవారం ఎమ్మెల్యే పరామర్శించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేష్ నాయక్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు రాజేశ్ నాయక్, ఈరంటి సాయి కృష్ణ, యాకేష్, యాకయ్య, మల్లేష్, వెంకటేశ్వర్ రావు, యాదగిరి పాల్గొన్నారు.



పాలకుర్తి టౌన్: ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఝాన్సీరెడ్డికి గాంధీ విగ్రహం అందజేస్తున్న బాధ్యులు

ప్రీస్కూల్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

కొడకండ్ల : అంగన్‌వాడీ కేంద్రాల్లోని ప్రీస్కూల్ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించి, ప్రైవేటుకు ధీటుగా బోధన చేయాలని ఐసీడీఎస్ సీడీపీఓ సత్యవతి కోరారు. మంగళవారం ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లకు పోషణ్‌బీ పడాయిబీపై కొడకండ్ల ఐకేపీ, రామవరం రైతువేదికలో శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. ప్రీస్కూల్ పిల్లల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తూ పోషకాహారంతో పాటు విద్య కోసం పాటుపడుతున్నందున అంగన్‌వాడీ సిబ్బంది ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా అంకితభావంతో పనిచేయాలని కోరారు. సూపర్‌వైజర్లు సరళ, సావిత్రి, శ్రీదేవి, తహేరాబేగం, ఝాన్సీరాణి, శరత్‌బాబు, నవీన్‌నాయుడు, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న సీడీపీఓ సత్యవతి

చర్యలు తీసుకోవాలి



జనగామ : మత మార్పిడిని ప్రోత్సహిస్తు, క్రైస్తవ ప్రార్థనలు చేయిస్తు, చర్చీలకు రమ్మని విద్యార్థులను ప్రలోభపెడుతున్న మిషనరీ విద్యాలయాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా నిర్వాహకుడు డాక్టర్ మోహన కృష్ణ భార్గవ కోరారు. మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి, అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. పిల్లల్ని, మన ధర్మాన్ని కాపాడుకోవడానికి తల్లిదండ్రులే స్పందించి యాజమాన్యాలను ప్రశ్నించాలన్నారు. క్రైస్తవ ప్రార్థనలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అంబటి బాలరాజు, కుందారపు భైరునాథ్, చిలువేరు హర్షవర్దన్, ఉల్లెంగుల రాజు, శ్రీనివాస్‌రెడ్డి, మధు, రమేష్, సంపత్, రణధీర్, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

కేజీబీవీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

డీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్/దేవరుప్పుల/పాలకుర్తిటౌన్ : అన్ని రకాల అర్హతలు ఉండి ప్రభుత్వ ఉపాధ్యాయులతో సమానంగా పనిచేస్తున్న కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి డిమాండ్ చేశారు. డీటీఎఫ్‌లో ఉపాధ్యాయుల సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా స్టేషన్ ఘన్‌పూర్ కేజీబీవీ, మోడల్‌స్కూల్‌ను ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని దేవరుప్పుల, కొడకండ్ల, పాలకుర్తి, స్టేషన్ ఘన్‌పూర్‌లోని కేజీబీవీ, మోడల్ స్కూల్‌లను సందర్శించినట్లు తెలిపారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు టైమ్‌స్కేల్‌ను వర్తింపచేస్తూ మినిమం బేసిక్ పే చెల్లించాలన్నారు. ప్రభుత్వం మోడల్‌స్కూల్ ఉపాధ్యాయుల సమస్యల్ని పట్టించుకోవడం లేదని, 010 పద్దు కింద వేతనం చెల్లించాలని, సర్వీస్‌రూల్స్ రూపొందించి అమలు చేయాలన్నారు. కార్యక్రమాల్లో డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎండీ షరీఫ్, ప్రధాన కార్యదర్శి ఇప్ప రాంరెడ్డి, జిల్లా కార్యదర్శి దూడయ్య, ఉపాధ్యక్షులు చొక్కయ్య, శ్రీనివాసులు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు శ్రీనివాసచారి, కమలాకర్‌రెడ్డి, ఎండీ.జహంగీర్ ఆయా మండలాల బాధ్యులు, ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



స్టేషన్‌ఘన్‌పూర్: మాట్లాడుతున్న లింగారెడ్డి

తప్పని యూరియా తిప్పలు



స్టేషన్‌ఘన్‌పూర్ పీఏసీఎస్ వద్ద యూరియా కోసం బారులుదీరిన రైతులు

స్టేషన్‌ఘన్‌పూర్ : మండల పరిధిలో రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదు. ఒక్క బస్తా కోసం ఎండకు, వానలో రైతులు గంటల తరబడి బారులుదీరి అవస్థలు పడుతున్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ పీఏసీఎస్‌కు మంగళవారం 400 బస్తాల స్టాక్ రాగా పంపిణీ చేశారు. రైతులు అధిక సంఖ్యలో రాగా పురుషులు, మహిళలను వేర్వేరుగా లైన్లలో ఉంచారు. పోలీసు బందోబస్తు మధ్య ఏఓ చంద్రన్ కుమార్, పీఏసీఎస్ సీఈఓ మగ్దుంఅలీ పర్యవేక్షణలో రైతులకు యూరియా బస్తాల పంపిణీ చేశారు. క్యూలో పలుమార్లు రైతులు తోపులాటలు చేసుకోగా స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. పీఏసీఎస్ గేటు, గోడ దూకి లోపలికి వెళ్లేందుకు రైతులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. కొందరికి యూరియా బస్తాలు అందక నిరాశగా వెనుదిరిగారు.

ఎండకు తట్టుకోలేక సొమ్మసిల్లిన మహిళా రైతు

యూరియా కోసం క్యూలో నిల్చున్న మండలంలోని తానేదార్‌పల్లి గ్రామానికి చెందిన మహిళా రైతు సోమాజి రేణుక ఎండకు తట్టుకోలేక సొమ్మసిల్లి పడిపోయింది. వెంటనే గమనించిన తోటి రైతులు, పోలీసు సిబ్బంది ఆమెను పక్కకు కూర్చోబెట్టి నీరు తాగించారు. అనంతరం యూరియా బస్తాను అందించారు. మధ్యాహ్నం పది నిమిషాల పాటు వర్షం కురిసింది. అయితే వర్షాన్ని సైతం లెక్క చేయకుండా రైతులు క్యూలో నిల్చున్నారు.

రైతుల కష్టాలు పట్టించుకోని రేవంత్ సర్కార్

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సమస్యలు ఏమాత్రం పట్టించుకోవడం లేదని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య ఆరోపించారు. స్టేషన్ ఘన్‌పూర్‌లో పీఏసీఎస్ వద్ద యూరియా బస్తాల కోసం రైతులు అధికసంఖ్యలో నిల్చున్న సమాచారంతో రాజయ్య తన సతీమణి ఫాతిమామేరితో కలిసి అక్కడికి చేరుకున్నారు. కాసేపు రైతులతో కలిసి క్యూలో ఉన్న రైతుల సమస్యల్ని నేరుగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం యూరియా పంపిణీ పరిస్థితి, ఎంత స్టాక్ వచ్చింది తదితర అంశాలను పీఏసీఎస్ సీఈఓతో మాట్లాడారు. అనంతరం యూరియా బస్తాల కోసం రాజయ్య, ఆయన సతీమణి థంబ్ ఇంప్రెషన్ వేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. నియోజకవర్గంలో యూరియా కోసం రోజుల తరబడి రైతులు అరిగోస పడుతుంటే ఎమ్మెల్యే కడియం శ్రీహరి పట్టించుకోవడం లేదని, పైగా యూరియా కొరత లేదని వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. యూరియా బస్తాల కోసం వచ్చి చెట్ల కింద నీడకు కూర్చున్న మహిళా రైతులతో కాసేపు మాట్లాడారు.



మహిళా రైతులతో మాట్లాడుతున్న రాజయ్య

కనులపండువగా గోపాలస్వామి కాలువలు

జఫర్‌గఢ్ : శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకొని మండలకేంద్రంలో గోపాలస్వామి కాలువలను మంగళవారం కనులపండువగా నిర్వహించారు. గోపాలస్వామి ఉత్సవ విగ్రహాలను ముస్తాబు చేసి రథంపై ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు మంగళహారతులతో స్వామివారికి స్వాగతం పలికి మొక్కుల చెల్లించారు. అనంతరం గాంధీ సెంటర్‌లో ముదిరాజ్ యువకులు స్తంభం జారుడు, ఉట్టికొట్టే కార్యక్రమాలు నిర్వహించారు.

బాణాపురంలో..

జనగామ : జిల్లా కేంద్రంలోని బాణాపురం శ్రీ వెంకటేశ్వర దేవాలయంలో సోమవారం రాత్రి శ్రీకృష్ణ స్వామి నిర్వహించారు. మంగళవారం ఉదయం వేద పండితులు స్వామివారికి 108 లీటర్ల పాలతో అభిషేకం, 25కిలోల వెన్నతో అలంకరణ చేసి, పుష్పాభిషేకం చేశారు. పురప్రముఖులు, వికాస తరంగిణి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



జఫర్‌గఢ్: స్తంభం జారుతున్న యువకులు



జనగామ: బాణాపురంలో..

నవాబుపేటలో..

లింగాలఘణపురం : మండలంలోని నవాబుపేట కోదండ రామస్వామి ఆలయంలో వైష్ణవ సాంప్రదాయ ప్రకారం శ్రీకృష్ణాష్టమి సందర్భంగా గ్రామంలో ఉట్ల సేవ నిర్వహించారు. ఉట్లు కొట్టే కార్యక్రమంలో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈఓ లక్ష్మీప్రసన్న, సీనియర్ అసిస్టెంట్ రాజేందర్ రెడ్డి, వేదపండితులు లక్ష్మినర్సింహాచార్యులు, కృష్ణమూర్తి, సిబ్బంది రవితేజ, ఎల్లగౌడ్, రమేష్, వసంత తదితరులు పాల్గొన్నారు.

'విముక్తి పోరాటం చేసింది కమ్యూనిస్టులే'



బచ్చన్నపేట: జెండా ఆవిష్కరిస్తున్న వెంకటేష్

బచ్చన్నపేట : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా అమరవీరులను స్మరిస్తూ మండలంలోని కొడవటూరు గ్రామంలో సీపీఎం మండల కమిటీ అధ్వర్యంలో ఎర్రజెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా మంగళవారం సీపీఎం మండల ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేష్ మాట్లాడుతూ.. భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడింది కమ్యూనిస్టులే అని అన్నారు. బైరగోని బలరాములు, నడిగొట్టు నర్సింహులు, మిర్యాపురం నరసయ్య, పాకాల పోచవ్వ, మేక మల్లమ్మ, అంజవ్వ, రాములు పాల్గొన్నారు.

తెలంగాణ రైతాంగ పోరాట స్ఫూర్తిని చాటాలి

దేవరుప్పుల : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుల స్ఫూర్తిని చాటాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సింగారపు రమేశ్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని కామారెడ్డిగూడెం, దేవరుప్పుల తదితర గ్రామాల్లో ఈ నెల 17వతేదీన (బుధవారం) జనగామలో నిర్వహించనున్న సీపీఎం సభకు ప్రచార రథం, కరపత్రాలతో ప్రచారం చేపట్టారు. ఇంటి వెంకట్‌రెడ్డి, రాములు, భిక్షపతి, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి రాక

జనగామ రూరల్ : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించనున్న బహిరంగ సభకు సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ రానున్నారని జిల్లా కార్యదర్శి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

జయప్రదం చేయండి

లింగాలఘణపురం : జనగామలో నేడు(బుధవారం) నిర్వహించనున్న సీపీఎం బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి కరుణాకర్ కోరారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో ఆటోలో విస్తృత ప్రచారం నిర్వహించారు. నాయకులు దేవదానం, ఉప్పలయ్య, సుల్తానా తదితరులు ఉన్నారు.

ఉప్పుగల్లులో వైద్యశిబిరం

జఫర్‌గఢ్ : మండలంలోని ఉప్పుగల్లులో కూనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. వివిధ వ్యాధులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. కూనూర్ ప్రాథమిక వైద్యాధికారి రాజమౌళి, రజిత, చందర్, సిబ్బంది పాల్గొన్నారు.

అష్టదళ పాద పద్మారాధన పూజ



చిల్పూరు : బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో మంగళవారం భక్త జనసందోహం నడుమ ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు-కిరణ్మయి దంపతుల ఆధ్వర్యంలో అష్టదళ పాద పద్మారాధన పూజ నిర్వహించారు. 108 బంగారు పుష్పాలు, వెండి పాదపద్మాన్ని అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణచార్యుల వేదమంత్రాల నడుమ స్వామివారి పాదాల చెంత ఉంచి ప్రత్యేక పూజలు చేశారు.

టీచర్లకు రక్షణ కల్పించాలి

పాలకుర్తి టౌన్ : టెట్ ఇన్ సర్వీస్ టీచర్లకు రక్షణ కల్పించాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇమ్మడి అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. విద్యాహక్కు చట్టం సెక్షన్ 23ను సవరించాలన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

తరిగొప్పుల / నర్మెట : హైదరాబాద్ ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించనున్న ఫొటో ఎక్స్‌పో వాల్‌పోస్టర్‌ను ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ తరిగొప్పుల మండల కమిటీ అధ్యక్షుడు పోలోజు రాజేష్ ఆధ్వర్యంలో ఎస్సై గుగులోత్ శ్రీదేవి, నర్మెట మండల శాఖ అధ్యక్షుడు గుండేటి రాంచందర్ ఆధ్వర్యంలో ఎస్సై నైనాల నగేష్ మంగళవారం ఆవిష్కరించారు.

వాహనాల తనిఖీ

దేవరుప్పుల/ పాలకుర్తి టౌన్ : దేవరుప్పుల మండలంలోని జనగామ-సూర్యాపేట రహదారిలో, పాలకుర్తి మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో మంగళవారం ట్రెయినీ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు సంపత్, మహేష్ గౌడ్ వాహనాలను తనిఖీ చేశారు. యజమానాలకు జరినామాలు వేశారు.

కస్తూర్బాలో ఫ్రెషర్స్ డే

దేవరుప్పుల : బాలికల విద్యాభివృద్ధికి కస్తూర్బా హాస్టళ్లు ప్రతిరూపాలని ప్రత్యేకాధికారి సుకన్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలకు స్పెషలిస్టులు

దేవరుప్పుల : జిల్లా ఏరియా ఆస్పత్రులకు పరిమితమైన స్పెషలిస్టు వైద్యసేవలు ఇకపై మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు విస్తరించనున్నాయి. ఈ మేరకు వైద్య ఆరోగ్య శాఖ ఆయా విభాగాల ప్రత్యేక వైద్యులను ప్రాథమిక అరోగ్య కేంద్రాలకు కేటాయిస్తూ మంగళవారం ఆదేశాలు జారీచేశారు. దేవరుప్పుల పీహెచ్‌సీలో పలువురు సేవలు అందిస్తారని వైద్యాధికారి రవితేజ వివరించారు.

ఉపాధ్యాయులను నియమించాలి



బచ్చన్నపేట : తమ పిల్లలకు చదువు చెప్పేందుకు ఉపాధ్యాయులను నియమించాలని నక్కవానిగూడెం ప్రాథమిక పాఠశాలలో మంగళవారం తల్లిదండ్రులు నిరసన తెలిపారు. ఉపాధ్యాయులు లేక విద్యార్థులు చదువులో వెనుకబడుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో పనిచేసిన ఇద్దరు ఉపాధ్యాయులు బాలమల్లయ్య, అనిల్ పదోన్నతితో బదిలీ అయ్యారు. 1నుంచి 5 తరగతులకు 12 మంది విద్యార్థులకు బోధించే వారే లేకుండా పోయారు. దీంతో విద్యాశాఖ అధికారులు ఎమ్మార్పీలతో పాఠశాలను నడిపిస్తున్నారు. అధికారులు స్పందించి రెగ్యులర్ ఉపాధ్యాయులను పంపించాలని, లేనిచో టీసీలు ఇవ్వాలని తల్లిదండ్రులు జంపయ్య, కరుణాకర్, మాధవి, సత్తెమ్మ, ప్రతాప్ రెడ్డి కోరారు.

సంక్షిప్త సమాచారం

హామీలు నెరవేర్చాలి

పాలకుర్తి టౌన్ : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఎమ్మెల్యే యశ్వినిరెడ్డికి మంగళవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు గుగులోత్ దేవ్‌సింగ్ వినతిపత్రం అందజేశారు.

పొక్లెయినర్ దహనానికి యత్నం

బచ్చన్నపేట : మండలంలోని చిన్నరామన్‌చర్ల గ్రామ రెవెన్యూ శివారులో రైతు దేవర మహేష్ తన వ్యవసాయ భూమిలో పొక్లెయినర్‌తో చదును చేస్తుండగా పక్క రైతులు మంగళవారం దానిని దహనం చేసే ప్రయత్నం చేశారని తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు వారిపై కేసు నమోదు చేశారన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

రఘునాథపల్లి : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు.


వరంగల్ సదస్సుకు తరలిన బీజేపీ శ్రేణులు

జనగామ రూరల్ : వన్ నేషన్.. వన్ ఎలక్షన్‌పై మంగళవారం వరంగల్‌లోని ఓ గార్డెన్‌లో నిర్వహించిన సదస్సుకు పట్టణంలోని బీజేపీ శ్రేణులు, విద్యార్థులు, యువకులు తరలివెళ్లారు. జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ జెండా ఊపి బస్సును ప్రారంభించారు.

పండుగల్లో పర్యావరణ రక్షణకు ప్రాధాన్యం

లింగాలఘణపురం: బతుకమ్మ, దేవీనవరాత్రి ఉత్సవాలు తదితర పండుగల్లో పర్యావరణ రక్షణకు ప్రాధాన్యం ఇస్తూ పండుగలు నిర్వహించాలని ఎంపీడీఓ రఘురామకృష్ణ కోరారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో స్వచ్ఛతా సేవ, పోషణ్, స్వచ్ఛతా నారీ పరివార్ కార్యక్రమాలపై ఆయా శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.

భాగస్వామ్యంపై అవగాహన పెంచుకోవాలి



లింగాలఘణపురం : పాఠశాల నిర్వహణలో విద్యార్థుల భాగస్వామ్యంపై అవగాహన పెంచుకోవాలని ఎంఈఓ విష్ణుమూర్తి కోరారు. మండల కేంద్రంలో మోడల్ స్కూల్‌లో మంగళవారం పాఠశాల హెడ్ బాయ్స్, గర్ల్స్, తరగతి గది లీడర్లను ఎన్నుకొని ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రిన్సిపాల్ సునీత, కాంప్లెక్స్ హెడ్మాస్టర్ విద్యారాణి, ఏఏపీసీ చైర్‌పర్సన్ పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండల కమిటీ ఎన్నిక



రఘునాథపల్లి : మండలంలోని నిడిగొండలో రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన బి.శంకరయ్య, కార్యదర్శిగా కె. సత్యనారాయణ, కోశాధికారిగా నామాల యాదగిరి, ఉపాధ్యక్షులుగా ఇన్నమ్మ, అసోసియేట్ అధ్యక్షుడిగా వి.ఎల్లేష్, ఉపాధ్యక్షుడిగా ఎండీ యూసుఫ్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎం.అంజయ్య, సహాయ కార్యదర్శిగా ఎ.నర్సింగరావు, ప్రచార కార్యదర్శిగా నాగభూషణం ఎన్నికయ్యారు.

గోవర్ధనగిరిలో ఓజోన్ దినోత్సవం

రఘునాథపల్లి : మండలంలోని గోవర్ధనగిరి ఉన్నత పాఠశాలలో మంగళవారం అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవాన్ని నిర్వహించారు. హెచ్ఎం డి.సత్యప్రకాశ్ ఆధ్వర్యంలో ఎన్‌జీసీ కోఆర్డినేటర్ సురేష్ నేతృత్వంలో విద్యార్థులకు ఓజోన్ పొరను 0.3గా సూచిస్తారని తెలిపారు. అనంతరం ప్రదర్శనలో విద్యార్థులు ఓజోన్ పొర సూచనగా గొడుగులు ఉపయోగించి ప్లకార్డ్స్‌తో సేవ్ ఓజోన్-సేవ్ ఎర్త్, సేవ్ ట్రీస్-సేవ్ లైఫ్, మొక్కలు నాటుదాం-పర్యావరణాన్ని కాపాడుదామని నినాదాలు చేశారు.

ఆర్థికసాయం

రఘునాథపల్లి : మండలంలోని లక్ష్మీతండా గ్రామానికి చెందిన భూక్య బన్ని (69) మంగళవారం మృతిచెందాడు. తండాకు చెందిన జై భీమ్ భవన నిర్మాణ సంఘం నాయకులు.. మృతుడి కుమారుడు మంజ్యాకు ఆర్థికసాయం అందజేశారు.

నిత్యావసరాల అందజేత

పాలకుర్తి టౌన్ : మండల కేంద్రానికి చెందిన కాటబత్తిని సోమేశ్వర్, లలిత దంపతులు మంగళవారం దేవరుప్పుల మండలం సీతారాంపురంలోని ప్రేమసదనం అనాథ వృద్ధ శరణాలయానికి 50 కేజీల బియ్యం, నిత్యావసరాలను అందజేశారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



జఫర్‌గఢ్ : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో ఉపాధ్యాయులు, పలువురు పాత్రికేయులను మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. రైతువేదికలో జరిగిన ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి రఘునందన్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా ఎంపీడీఓ సుమన్ హాజరై మాట్లాడారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన గ్రహీతలను శాలువాలు, ప్రశంసపత్రాలతో సత్కరించారు.

దేవరుప్పుల: మండలంలోని సింగరాజుపల్లి ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న పసునూరి శ్రీదేవి, భాస్కుల అంజయ్యను మండల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు స్వీకరించిన సందర్భంగా సన్మానించారు.

డీఈ రాంబాబుకు..

స్టేషన్‌ఘన్‌పూర్ : ఇంజనీర్స్‌డే సందర్భంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య అవార్డును అందుకున్న టీఎస్ఎన్పీడీసీఎల్ డీఈ వై.రాంబాబును విద్యుత్ ఉద్యోగుల ఐఎన్‌టీయూసీ 327 యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ 327 యూనియన్ రాష్ట్ర సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం ఐలేష్, ఉపాధ్యక్షుడు నరేందర్, నాయకులు పాల్గొన్నారు.

కొడకండ్ల : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తూ ఉత్తమ అవార్డు పొందిన సరోజనను నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు.